

# నెమలినార

బి. మురళీధర్

"కైలాసంలో శివుడినే మెప్పించినవాడను! ఇంద్రలోకంలో ఇంద్రుడినే చెరపట్టిన వాడను! ఈ ముల్లోకాల్లోనూ నాకెదురులేనివాడను! నువ్వా? నన్ను గెలుచువాడవు! హ్హా! హ్హాహ్హా! హ్హా!...'' అని రావణుడు భయంకరంగా వికటాట్టహాసం చేశాడు.

"ఓరీ రావణా! పరసతిని చెరబట్టిననాడే నీ గొప్పతనం తేటతెల్లమయిందిరా! అబలను చెరబట్టిన నీవా గొప్ప వీరుడివి? మాయోపాయంతో నా ఆలిని ఎత్తుకొచ్చిన నువ్వా ఒక శూరుడివా? చాలించు నీ వ్యర్థ ప్రేలాపన! కాచుకో ఇక నీ ప్రాణాలను!'' రాముడు, రావణుడిని హేళన చేశాడు.

శ్రీరామ పట్టాభిషేకం యక్షగానం మంచి ఊపు మీద ఉంది! రామరావణుల సంవాదం అప్పుడే పాటల రూపంలోనూ, కాస్సేపటికి మాటల రూపంలోనూ నడుస్తూ వుంది. అప్పటికి రాత్రి రెండు గంటలవుతోంది. బ్రాహ్మీ ముహూర్తం దాకా రావణవధ, విభీషణుడి పట్టాభిషేకం, సీతమ్మవారి అగ్నిప్రవేశం అయిపోతాయి. సరిగ్గా బ్రాహ్మీ ముహూర్తంలో శ్రీరామపట్టాభిషేకం, మంగళహారతి జరుగుతాయి. అది నాటకమైనా- పట్టాభిషేకం, మంగళహారతి మంచి ముహూర్తంలో జరగవలసిందే!

స్టేజికి అటూ, ఇటూ వేలాడదీసిన రెండు పెట్రోమాక్స్ లైట్లు కొంచెం మసకబారగానే, రావణుడు వెంటనే వాటిలో గాలి కొట్టాడు. లైట్లు మరింత వెలుగునిస్తున్నాయి. ఆ వెలుగులో రామరావణుల భుజకీర్తులూ- కిరీటాలూ ధగధగా మెరిసిపోతున్నాయి.

ప్రేక్షకులకు ఈ యుద్ధఘట్టం ఎంతో ఇష్టమైనది. మద్దెల తాళాలు వీరరసాన్ని నిండా ఆవిష్కరిస్తున్నాయి. నాటకం చూసే పిల్లలు సరిగ్గా కనబడాలని మోకాళ్ల మీద లేచి చూస్తున్నారు. రేపు మళ్లీ తమ సావాసగాళ్లతో- ఈ సీనంతటినీ- ఏ పశువుల కొట్టంలోనో- ఏ గడ్డివాముల మధ్యనో అభినయించాల్సి వుంది గనుక- వాళ్లు కన్నార్పడం లేదు!

"ఒరేయ్ సిన్నోడా! లడాయి అచ్చినపుడు లేపమంటివి గదరా! అగో సూడు! లడాయి జేత్తున్నరు! లెయ్! లేయ్!'' ఒక ముసలావిడ తన మనుమడిని నిద్ర వదిలించేందుకు ప్రయత్నిస్తోంది.

"లేకపోతే మళ్ల తిట్లు దిడతరు! లేవ్వండ్రిరా అంటే లేస్తలేరు! రావణుడి ఏషమచ్చింది లెండిరా!'' మరో తాత మనుమలను లేపుతున్నాడు.

"రావణా! కాచుకో ఈ బ్రహ్మాస్త్రాన్ని!'' అని రాముడనగానే మద్దెల, తాళాలు తమ హోరు తారాస్థాయికి పెంచేశాయి. స్టేజీ మీద పిడుగులు పడే శబ్దాన్ని సృష్టించడానికి అవి శాయశక్తులా వాయించబడుతున్నాయి. ఆ చప్పుడికి అంతదాకా మగత మగతగా జోగుతున్నవాళ్లు, ఇంకా లేవనివాళ్లు అందరూ చప్పున లేచి కూర్చున్నారు.

ఆ వాయిద్యాల హోరు నేపథ్యంలో రాముడు తళతళ మెరుస్తోన్న ఒక ప్రత్యేక బాణాన్ని తీశాడు. ప్రేక్షకులు సంభ్రమంగా ఆ బాణంవైపు చూస్తున్నారు. సీతమ్మవారిని అష్టకష్టాలు పెట్టిన ఈ దుష్ట రావణుడు ఈ బాణంతో చస్తాడు గాబోలు! అని ఎవరికివారే అనుకొని మరింత కళ్లు విప్పార్చుకొని చూస్తున్నారు. ప్రేక్షకులు అరుపులూ, ఈలలతో కళాకారులకు ఉత్సాహాన్నిస్తున్నారు.

రాముడు బాణం ఎక్కుపెట్టాడు. అంతలోనే ఒక మనిషి స్టేజీ మీదకు వచ్చి రాముడి చెవిలో ఏదో చెప్పాడు. రాముడు వెంటనే రావణుని దగ్గరకు పిలిచి చెవిలో ఏదో చెప్పాడు. ఇద్దరూ కలిసి తెర వెనక్కి వెళ్లి పోయారు. వాయిద్యాలూ ఆగిపోయాయి!

నాటకం రసవత్తర ఘట్టంలో ఆగిపోయింది. ప్రేక్షకులంతా నిశ్శబ్దమైపోయారు. ఏమయింది? ఏం జరిగింది?

తెర వెనుక నుంచి ఏవో మాటలు వినిపిస్తు న్నాయి! కానీ స్పష్టత లేదు!

మరికాస్సేపటికి- రాముడి పాత్రధారి- రాముడి వేషంలోనే- ఇందాక స్టేజి మీదకు వచ్చిన మనిషితో పాటు వడివడిగా నడిచి వెళ్లిపోతున్నాడు.

ఆ దృశ్యం చూస్తే, రాయిలా మారి అడవిలో పడి వున్న అహల్యను మనిషిగా మార్చడానికి విశ్వామిత్రుని వెంట నడుస్తున్న రాముడు గుర్తుకు వస్తున్నాడు. ఈ రాముడు అంత గొప్పవాడు కాకపోయినా, మృత్యు ముఖంలో వున్న ఏ ప్రాణినో బయటకు లాగడానికే అంత జరూరుగా ఆ మనిషి వెంట నడిచి వెళ్తున్నాడు.

మరి కాసేపటికి ప్రేక్షకులందరికీ విషయం తెలిసి పోయింది!

"కట్ల ఆశన్న దుక్కిటెద్దుకు నోట్లెకెళ్లి నురగలు వస్తున్నయట! భూమ్మీద పడి కాళ్లు తన్నుకుంటున్న దట!"

"నారాయణయ్య వెళ్లాడు గదా! తక్కయితది!" ఆ భరోసా మాటనే అందరినోటా వినిపించింది!

అప్పుడు- నాటకం కన్నా ఒక మూగజీవి ప్రాణమే గొప్పదని - తమ వినోదం కన్నా- తమ దుక్కిటెద్దు చాలా గొప్పదని వారు చాలా సహజంగా అనుకోవడం వలన, రాముడు వచ్చేదాకా వేచి చూడడంలో ఏమాత్రం అసహనం కనబరచలేదు ఆ పల్లెవాసులు.

ఈలోగా జనాలను నవ్వించేందుకు, బుడ్డరిఖాన్ వేషం స్టేజి మీదకు వచ్చింది. నాటకం ఆగిపోగానే, అలాగే నిద్రలోకి ఒరిగిన వాళ్లందరూ మద్దెల మీద సరస మైన దరువు వినగానే, 'బుడ్డరిఖాన్ అచ్చిండూ!' అని లేచి కూర్చున్నారు.

నాలుగు చరణాలు ఒక పేరడీ పాటను పాడిన బుడ్డరిఖాన్ పాట ఆపేసి ప్రేక్షకులను పలకరిస్తున్నాడు.

"ఏంటికి గుసున్నరుబై మీరంతా! మా రావణ మామగాడు ఎట్ల జస్తడో సూద్దమని కూసున్నరా! వారెవ్వా!... మా రావణ మామగాడు ఎంత దుష్టుడైతే ఏంది! నాకు పిల్లనిస్తనన్నడు! - సగం రాజ్యమిస్తనన్నడు గది సాలు మనకు! ఆడు ఎసుంటోడైతే నాకేంది! నాకైతే మంచోడే!... మీకూ ఏమన్న ఇస్తనన్నడంటే మీకూ మంచోడే అవుతడు!..."

"అరేయ్ బుడ్డరిఖాన్! గవన్నీ మల్ల! మీ రాము డెటువొయిండు!" ఎవరో అరిచారు జనంలో నుండి.

"అయ్యో! పెద్దన్నా! నీకింకా చెప్పనే లేదా! రావ ణుడిని జంపతందుకు ముహూర్తం మంచిగ లేదటనే! మంచి ముహూర్తం చూపియ్యతందుకు పంతులయ్య దగ్గరికి వొయిండు! ముహూర్తం ఎల్లంగానే అచ్చేస్తడు. అవుగానీ! నువ్వు లావులాకి జేస్తున్నవు! నీకెటువోయే దున్నదే! ఇంకా తెల్లారనేలేదు! అప్పుడే 'ఆస్త' మొద లయినాది! గందుకే ఆనలు సరిగ పడతలేవు! ఉలవలు సరిగ పండుత లేవు!" అంటూనే బుడ్డరిఖాన్ మనుషుల ఆశపోతుతనం గురించి ఒక పాట అందుకున్నాడు!

రాముడి వేషం కట్టిన నారాయణయ్య, ఆ వూరి జనాలకు నిజంగా అపర నారాయణుడే! తరతరాలుగా వారి తాత ముత్తాతల కాలం నుంచి సంక్రమించిన వైద్యజ్ఞానం అతని నరనరాన ఇమిడి వుంది. మనుష లకు సుస్తీజేసినా, పశువులకు జబ్బు వచ్చినా ముందుగా కబురు వెళ్లేది నారాయణయ్యకే! 'ఆయన చేత మందు పడిందంటే, చావు కూడా వెనుకకు తిరిగి వెళ్లిపోతుంది!' అనే నమ్మకాన్ని అనుభవపూర్వకంగా ఏర్పర్చుకున్నారు ఆ వూరి జనాలు.

నారాయణయ్య వద్దకు అర్ధరాత్రీ, అపరాత్రీ లేకుండా బాధితులు వస్తూనే వుంటారు. తన విద్యను పవిత్రమైనదిగా భావించిన నారాయణయ్య కూడా వచ్చినది మనిషైనా, పశువైనా విసుక్కోకుండా వైద్యం చేసి పంపిస్తాడు.

పశువుల వైద్యంలో నారాయణయ్యను మించిన వైద్యుడిని ఆ చుట్టుపక్కల గ్రామాలలో మూడు తరాల నుంచి ఎవరినీ చూడలేదంటారు వయోవృద్ధులు. మూగజీవాల బాధను కనిపెట్టి సరైన మందు వేస్తాడు. వాటికి వచ్చే రోగాల గురించి అతనికి చాలా తెలుసు. పశువు ఏ మొక్కను తింటే ఏ రోగమొస్తుందో! ఏ గడ్డి మేస్తే అజీర్ణమవుతుందో! ముల్లుగడ్డి మేసిన పశువు ఎలా ప్రవర్తిస్తుందో- ఇలా అన్ని రోగ లక్షణాలు తెలుసు.

అంతేకాదు! పశువులకు హాని చేసే మొక్కలు ఆ వూరి శివారుల్లో ఏఏ దిక్కుల్లో పెరుగుతాయో తెలుసు. ఆ మొక్కలు ఏఏ నెలల్లో ఏపుగా పెరిగి హాని కారకంగా మారతాయో తెలుసు. అందుకనే పశువు

లను, మేకలను ఫలానా నెలలో ఫలానా వైపుకి మేతకి తీసుకుపోవద్దు అని ముందుగానే ఆ వూరి కామందులకు సలహాలు ఇచ్చేస్తాడు. నారాయణయ్య సలహాలను తప్పకుండా పాటిస్తారు. అయినా ఒక్కోసారి పశువులే కట్టు తెంచుకుపోయి, మంచిగడ్డి ఆశలో పడి చెడు మొక్కలనూ మేసి వస్తాయి.

కట్ల ఆశన్న దుక్కిటెద్దు కూడా ఏదో తినరాని మొక్కను తినేసినట్లున్నది. అందుకే అర్ధరాత్రి ఎడాపెడా తన్నుకుంటున్నది!

నారాయణయ్య తన వైద్యానికి అవసరమయ్యే చాలారకాల మొక్కలనూ, చెట్లనూ, పొదలనూ తన ఇంటి ఆవరణలోనే పెంచుకున్నాడు. మొత్తం అర ఎకరం విస్తీర్ణం కలిగిన పెరడులో రకరకాల అరుదైన మొక్కలూ ఎక్కడా కనిపించని తీగలూ- విచిత్రమైన ఆకారంలో పొడవైన కాయలు కాసే చెట్లూ- ఎన్నో వున్నాయి. నారాయణయ్య ఎక్కడెక్కడి నుంచో వాటిని సేకరించి తెచ్చాడు. ఆ పెరడులోని ఆయుర్వేదవనంలో వింతగా కనిపించి చూసేవారిని విస్మయానికి గురి చేసేవి 'వజునుకలు' (ఇవే బదనికలు!). కేవలం వృక్షాల కొమ్మల మీద పెరిగే తీగల్లాంటి చిన్న పొదలు! రంగురంగుల పూల గుత్తులూ, విచిత్రమైన ఆకారాలలోకి వంపులు తిరిగిన కొమ్మలూ- వజునుక పొదల ప్రత్యేకత! ఆ వజునుక పెరిగే వృక్షాన్నిబట్టి దాని ఔషధ గుణం ఆధారపడి వుంటుంది. వేపచెట్టు మీద పెరిగిన వజునుక ఒక రోగానికి పనికివస్తే, విప్ప చెట్టు మీద పెరిగిన అదే వజునుక మరో రోగానికి పనికి వస్తుంది.

ఈ వజునుకల వైద్య రహస్యం కేవలం నారాయణయ్యకు మాత్రమే తెలుసు!

ఉదయం లేవగానే పెరట్లోని చెట్లను పరిశీలించి, పాదులు తీసి చేదబావి లోంచి స్వయంగా నీళ్లు తోడి పోయడం నారాయణయ్య దినచర్య.

నారాయణయ్య తను చేసిన వైద్యానికి ఎవ్వరినీ చేయి సాచి ఏమీ అడగడు. ప్రతిఫలం తీసుకొంటే తన వైద్యం పనిచేయదని చెప్తుంటాడు. అందుకే నారాయణయ్య కుటుంబ అవసరాలను వూరి జనాలే కనిపెట్టి స్వయంగా తీరుస్తారు. ఆ వూళ్లో పండిన ప్రతి దినుసు, కాసిన ప్రతి కాయ, పండు, ఆయన ఇంటికి కావలసిన దానికన్నా ఎక్కువ చేరవేస్తారు. నారాయణయ్య కుటుంబాన్ని పోషించుకోవడం, తమ కుటుంబాన్ని పోషించుకోవడమంత బాధ్యతగా భావిస్తారు, ఆ వూరి జనాలు!

అందుకనే నారాయణయ్య రాముడి వేషం కడితే, ఆయనలో సాక్షాత్తు, ఆ రామచంద్రుడినే చూస్తున్నంతగా పరవశులవుతారు ప్రజలు.

చివరకు నారాయణయ్య దుక్కిటెద్దుకు వైద్యం చేసి తిరిగి రావడమూ, రావణ సంహారం గావించడమూ అయింది. బ్రాహ్మీ ముహూర్తంలోనే శ్రీరామ పట్టాభిషేకం, మంగళహారతీ ఘనంగా జరిగి నాటకం ముగిసింది.

*

యుగయుగాలుగా కొనసాగుతోన్న జగన్నాటకం ఇంకా ముగియలేదు. ఈ నాటకంలో మరో కొత్త అంకానికి తెర లేచిపోయింది.

నారాయణయ్య ఉంటున్న ఊరు చాలా పెద్దగా పెరిగిపోయింది. ఊరుతోబాటు జనాలూ పెరిగారు. వారితోబాటు నారాయణయ్య ముగ్గురు కొడుకులు పెరిగి పెద్దవాళ్లయిపోయారు. ఎవరి సంసారాలు వాళ్లకున్నాయి. ఎవరి సంపాదనా వాళ్లకుంది. అయినా ఇన్నాళ్లూ ఒకే ఇంట్లో ఉమ్మడిగా కలిసి వున్నారు. కానీ ఇక అలా ఉండలేని స్థితికి వచ్చేశారు.

సామాజిక పరిణామ క్రమంలో, కుటుంబం - కుటుంబాలుగా విడిపోవడం అనివార్యమైన సహజ పరిణామం.

నారాయణయ్య పెరట్లో జామచెట్టు మీద గూడు కట్టుకున్న పిచ్చుకల జంట, తాము పెంచిన పిల్లలకి రెక్కలొచ్చినాయని గమనించి, గూడులోంచి పిల్లల్ని బయటికి తరిమేయాలని ప్రయత్నిస్తున్నాయి. కానీ తల్లిదండ్రులు అప్పనంగా తెచ్చి నోట్లో పెట్టే ఆహారానికి అలవాటుపడిన ఆ పిల్లలు ససేమిరా గూడు వదిలి రానంటున్నాయి. కాస్సేపు గారం చేశాయి. మరి కాసేపు మారాం చేశాయి. చివరికి తల్లిదండ్రులు వాటిని తోక పట్టుకు ఈడ్చి అవతల పారవేసి, 'పొండి! ఈ లోకంలో ఎక్కడైనా బతుకపొండి!' అని చెప్పేశాయి.

నారాయణయ్య అలా చెప్పలేకపోయాడు. రెక్కలొచ్చిన నారాయణయ్య పిల్లలు- ఒక గూట్లో ఇమడలేక- బయటకు పోలేక- చివరకు గూడునే ముక్కలు చేసి పంచుకుందామనే ఆలోచన చేశారు.

ఇంటి ఆవరణ విశాలంగా ఉంది. ఇప్పుడు వుంటున్న ఇల్లు తల్లిదండ్రులకు వదిలేసి, మిగతా స్థలాన్ని ముగ్గురూ సమానంగా పంచుకొని, ఎవరి గూడు వారు కట్టుకోవాలన్న నిర్ణయానికి వచ్చేశారు. అదే మాట తండ్రితో చెప్పారు.

నారాయణయ్య మొదట నమ్మలేనట్లుగా చూశాడు. కొడుకులు స్పష్టంగా చెప్పేసరికి నమ్మక తప్పలేదు.

''కానీ... గిదెట్లా కుదురుతుందిరా! ఇదేమన్నా సాపు జాగానా! తాళ్లేసి పంచుకునేతందుకు. ఈ మందుల చెట్లన్నీ ఏమయిపోతయి. ఈ తీగలు, గడ్డలు అన్నీ ఏమయిపోతయి. అంతగా ఇదుంటే ఊర్లె యాడన్నా జాగాలు కొనుక్కోని కట్టుకోండి!'' కొంచెం కటువుగానే అన్నాడు.

''బయట జాగాలు కొనెతందుకు మన దగ్గర గన్ని పైసలు యాడున్నయి. ముందుగ జాగా గొనాల, మల్ల ఇల్లు గట్టాల! అయ్యేపనేనా అయ్యా!''

''అదిగాదురా! ఈ చెట్టూ, శామా పోతే దొరుకు తాయా మళ్లా! ఇసుంటి వజునుకలు ఈ చుట్టుపక్కల యాభై కోసుల దూరంలో గూడా యాడా లేవు!''

''ఇప్పుడు వజునుకలు, ఈ కాయగసరు వైద్యం ఓళ్లకోసమే అయ్యా! పోనీ నువ్వన్నట్లే ఈ జాగ ఇట్లనే ఉంచినవనుకో! నువ్వు ఉన్నంతదాక మందులు ఇస్తవు. మళ్లీ నీ తర్వాత అవి ఓళ్లు పోస్తరు. ఓళ్ల కస్తది ఆ విద్య!'' పెద్దోడు అన్నాడు.

''ఓళ్లో ఎందుకు మీ ముగ్గట్లకెళ్లి ఓళ్లన్నా ఒక్కోళ్లు నేర్చుకోండ్రి. ఇన్నొద్దుల సంది సూస్తనే ఉన్నరు. గాయింత విద్య చేతవట్టలేరా!''

''ఈ విద్య చేతవడ్తే కడుపు నింపుతదావే అయ్యా! నీ జమాన వేరు. ఆ మంది వేరు. ఆ బుద్ధులు వేరు. ఇప్పుడు ఇసుంటి వైదికపు విద్యను ఓళ్లడుగుతున్నరు. మనింటికే మునుపటి మెరంగమంది అస్తున్నరా! మంది పొద్దువొడక ముందు నుంచి ధారవడ్తుండ్రి. ఇప్పుడు ఓళ్లస్తున్నరని! ఓళ్లకోసం ఇంకా నువ్వు ఈ వనం ఉంచుతనంటవు!'' మధ్య కొడుకు అన్నాడు.

''నీ కొడుకులను గాదని మందికోసం ఇంత పెద్ద జాగాను ఉంచుతనంటే గిదెట్ల న్యాయమే అయ్యా! మరి ఇప్పుడు మనుషుల కోసం దవాఖానాలే ఉన్నయి. గోజుల కోసం గోజుల దవాఖానాలున్నయి. సర్కారు మందులు ఇయ్యతందుకు మనుషులున్నరు. ఇంకా ఎవరికోసం ఇదంత?'' చిన్నోడన్నాడు.

''ఓళ్లకోసమంటే ఏం జెప్పాలిరా! ఎన్ని దవాఖానాలు వచ్చినా, ఎన్ని మందులు వచ్చినా- ఆ సర్కారు మనుషులంతా టైముల ప్రకారం డ్యూటీ చేస్తరు గదరా! రోగాలు, నొప్పులు ఆళ్ల డ్యూటీ టైమ్ జూసుకొని రావు గదరా! అందుకు అంటున్న! నా దగ్గరకు అచ్చినోళ్లకు వాపసు ఎట్ల పంపియ్యాల అనే బాధ ఉన్నదిగని, మీ మీద ప్రేమలేక కాదు!'' నారాయణయ్య బాధగా అన్నాడు.

''కాలం మారిపోయిందే అయ్యా! దాంతోటి మనుషులు గూడా మారిపోయిండ్రు! ఆళ్లతోని మనం గూడా మారిపోవాల! మారనంటే కుదరనే కుదరది!'' పెద్దోడు అనునయింపుగా అన్నాడు.

''కాటికి కాళ్లు జాపుకొని ఉన్నం. గిప్పుడేం మారతం. మీరు ఉంటరు గదా! మీరు మారిపొండ్రి! కాని కనీసం నేను బొంది ఇడిసిపోయేదాకనన్నా ఆగుండ్రి! నా కండ్ల ముందర నా సెట్లు వొంగ నేను సూడలేను!''

''పైసలు పారేస్తే, నీ సెట్ల మందులకన్నా మంచి మందులు దొరుకుతున్నయి గదనే అయ్యా! గా పైసలు లేనోళ్లే గదా నీ దగ్గరకు అస్తున్నరు.''

''మరి ఆ గరీబ్‌గాళ్లకు ఓళ్లన్నా సహాయం జెయ్యనేవడ్తది గదా!''

చిన్నోడు సహనం కోల్పోయాడు. ఎంతజెప్పినా తండ్రి అదే మాట మాట్లాడుతున్నాడు.

''ఇగో అయ్యా! ఇంత జెప్పినం! ఇగ నీ ఇష్టం. నువ్వు గరీబ్‌గాళ్లకు మందులు పోసుకుంటా ఉంటవో - నీ కొడుకులను గరీబ్‌గాళ్లను జేస్తవో నీ ఇష్టం. విచారం జేసుకో. కాదూ, పోదూ అంటే రేపటి సంది చిప్పలు వట్టి అడుక్కుతింటం! గదే గతి అవుతది మాకు!'' అని చిన్నోడు నిష్ఠూరంగా అన్నాడు.

రెండు రోజుల్లో విషయం ఊళ్లోని వాళ్లందరకూ తెలిసింది. ఇద్దరు ముగ్గురు ఔత్సాహిక ధర్మనిపుణులు నారాయణయ్య ఇంటిదాకా పనికట్టుకు వచ్చి మరీ ఉచిత తీర్పు చదివేశారు. వారి సారాంశమేమిటంటే-

''ఇగో నారాయణయ్యా! పిలగాండ్లు అనే మాట గూడా సబబుగనే ఉన్నది. నీ జమాండ్ల నువ్వు ఏం జేసినా నడిచింది. అడగక ముందు మీ ఇంటికి సాలు గాసం నడిచి వచ్చేది. ఇప్పుడా కాలం ఉన్నదా! పనికి రాని చెట్లూ, చేమల కోసం, కొడుకులను అన్యాయం జేస్తనంటే ఎట్లా? ఆళ్లెటు పోవాల? ధర్మం తెలిసినోడివి! కొడుకులకు జాగా పంచియ్యనంటే అన్యాయం కాదా! మేమందరం లోకరీతిగ పంచియ్యలేదా! అంత ఓపికుంటే యాడన్నా ఇంకొక ఎకరం భూమి కొనుక్కొని అక్కడ చెట్లు పెంచుకో! అడివే పెంచుకో! కానీ గీ నడీ ఊర్లె చెట్లు పెంచుతానంటే ఎట్లా! పంచి ఇయ్యడమే న్యాయం!''

అలా తీర్పు ఇచ్చేసిన వాళ్లల్లో నారాయణయ్యతో అర్ధరాత్రిపూట అత్యవసర వైద్యం పొందిన వాళ్లు కూడా ఉండడం విశేషం.

ఆ రాత్రంతా కంటి మీద కునుకు లేకుండా గడిపిన నారాయణయ్య 'కాలగతిని తప్పించ నెవ్వారి తరమూ...' అనే నిర్ణయానికి వచ్చేశాడు.

ఉదయాన్నే తన నిర్ణయం కోసం అడిగిన కొడుకులకు మౌనం వహించి తన అర్ధాంగీకారాన్ని తెలియజేశాడు. దానినే పూర్తి అంగీకారంగా అర్థం చేసుకున్న ఆ కొడుకులు కార్యాచరణలోకి దిగిపోయారు.

ఫలితంగా రెండు మూడురోజులలో ఒకరిద్దరు పురప్రముఖుల సమక్షంలో ముగ్గురూ ఆ స్థలాన్ని సమాన వాటాలుగా పంచేసుకున్నారు.

మర్నాడే మంచి ముహూర్తం ఉన్నదని ఎవరి వాటాలో వాళ్లు స్థలాన్ని చదును చేయడం ప్రారంభించారు.

పెద్దోడి వాటాకు వచ్చిన స్థలంలో మంచినీళ్ల బావి ఉంది. బావి చుట్టూతా విశాలమైన చప్టా. బట్టలు తికేందుకు వేరే స్థలం, స్నానం చేసేందుకు ఆపక్కనే కట్టిన దడి! అన్నీ కలిపితే బావి చుట్టూతా బాగానే స్థలం ఉంటుంది. ఆ స్థలం ఉపయోగపడాలంటే బావి పూడ్చి వేయాలి. పెద్దోడి ఇంటికి బావి వాస్తు ప్రకారం కూడా దోషకారకమవుతుందని ఎవరో చెప్పారు.

చిన్నప్పటి నుంచి అదే బావినీళ్లు తాగి పెరిగిన పెద్దోడు చివరకు ఆ బావిని పూడ్చేందుకు సిద్ధమయ్యాడు.

'బావిపూడ్చేస్తారట,' అన్న మాట నారాయణయ్య చెవిన పడగానే తనను ఎవరో కాదు, కన్నకొడుకులే బతికుండగానే పూడ్చేస్తున్నంత భయం! అసహ్యం కలిగింది. మొన్న పంపకాల రోజున పెద్దోడు అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

'మా కాలంల మేము  బతకాలంటే నీమెరంగ ఉంటే కుదరది! యాల్లవడితే ఎంతకన్నా తెగియ్య వడ్తది! మెత్తగ ఉంటే మొత్తిపోతుంది ఈ జమానా!'

యాల్లవడితే ఎంతకన్నా తెగిస్తారు. తల్లి రొమ్ముని తన్నినట్లు తను తాగిన బావినే పూడుస్తారు. ఇదేనా ఈ కాలం వీళ్లకు నేర్పుతున్నది?

లోకం తనమీద తనే మట్టి వోసుకొని పూడ్చుకునే కాలం అచ్చేసినట్లే అనిపించింది నారాయణయ్యకు.

మరోరోజు తడకల చాటున స్నానం బండ మీద స్నానం చేస్తున్నాడు నారాయణయ్య. గొడ్డలితో చెట్టు మాను మీద బలంగా కొట్టిన చప్పుడు వినిపించింది. వెంటనే తడి బట్టలతోనే బయటకు వచ్చి చూశాడు.

చిన్నోడు 'నెమలినార'ను నరుకుతున్నాడు.

నారాయణయ్య రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ఆవేశం పొంగుకొచ్చింది!

"ఒరేయ్ చిన్నోడా! ఆగు! ఆగురా! నెమలినారను ఎందుకు కొట్టేస్తున్నావురా! అదేమన్నదని నిన్ను!" అంటూ తడిబట్టలతోనే చిన్నోడి దగ్గరకు వచ్చి గొడ్డలి లాగేశాడు.

చిన్నోడి వాటాకు వచ్చిన స్థలంలో నెమలినార అనే అరుదైన చెట్టు వుంది. దాని పక్కనే కానుగచెట్టు వుంది. కానుగచెట్ట నీడలో పెరిగిన నెమలినార చెట్టులో ఔషధగుణం రెట్టింపు అవుతుందట! అందుకని రెండింటిని కలిపి ఒకే పాదులో పెంచాడు నారాయణయ్య.

నెమలినార చెట్టు అడవిలో కూడా చాలా తక్కువగా కనిపిస్తుంది. పశువులకు వచ్చే అనేక రోగాలకు నెమలినార ఆకుల కషాయం, రసం దివ్యమైన ఔషధంలా పనిచేస్తుంది. అనేక నొప్పులకూ, రోగాలకూ కూడా సత్వర ఉపశమనాన్ని కలుగజేయడం దాని ప్రత్యేకత! నారాయణయ్య దీనిని అప్పుడప్పుడు మనుషుల వైద్యంలో కూడా వాడతాడు.

నెమలినార చివరి లేత కొమ్మలు నెమలి పింఛపు ఆకారంలో అర్ధచంద్రాకారంగా వంగి వుంటాయి. ఆ కొమ్మలపై ఆకుల అమరిక నెమలి పింఛానికి నెమలి కన్నులు అమర్చినట్లుగా ఉంటాయి. ఆ చెట్టుకి నెమలి నార అని పేరు పెట్టినవారు, గొప్ప కళాత్మక హృదయం, అంతకంటే గొప్ప సౌందర్య దృష్టి కలిగినవాళ్లై ఉంటారు.

"ఒరేయ్ చిన్నోడా! కనీసం ఈ నెమలినార చెట్టునైనా ఉంచరా! ఇది చాలా మంచి చెట్టురా! ఎసుంటి రోగాన్నైనా ఘడియల మీద తక్కువ జేస్తుందిరా! దీన్ని శానా దూరంకెల్లి దెచ్చి పెంచినరా! దీన్ని ఇడుసవెట్టురా!" బాధగా బతిమిలాడాడు.

"అయ్యా! నెమలినార నెమలినార అంటున్నవు. అగో పెద్దన్న జూడు. తన జాగంతా ఎట్ల సాపు జేసుకున్నడో! బావి గూడ్చేసిండు. కరివేప చెట్టు, దానిమ్మ చెట్టు ఇవన్నీ గొట్టేసిండు. నువ్వేమో నన్ను చెట్లు కొట్టద్దంటున్నవ్!"

"అదిగాదురా! దానిమ్మ, కరవేపా- యాడంటే ఆడ దొరుకుతయిరా! కానీ ఈ నెమలినార యాడ దొరుకది. ఇదొక్కటుంటే సాలు! సగం బలం నాకు! ఉంచురా!"

"ఇగో అయ్యా! ఇది ఉంచుతే రేపు పిలగాండ్లు ఈడ దిరుగుతరు. ఏదన్నా కొమ్మ ఇరిగిపడ్తే ఎట్ల! అదీగాక ఇది నా ఇంటి ముందరనే అస్తున్నది. నడీ దర్వాజలకు ఇంత పెద్ద సెట్లు కనిపిస్తే మంచిగుంటదా! ఇగ నువ్వు అది గొట్టకు, ఇది గొట్టకు అని అడ్డమస్తే ఎట్లా? మస్తు దొరుకుతయి ఇసుంటి సెట్లు!" అని కిందపడిన గొడ్డలి తీసుకొని చెట్టు మీద మరి నాలుగు దెబ్బలు వేశాడు.

నారాయణయ్య చెప్తున్న మాటలు విననట్లే నటిస్తూ, నెమలినారను నేలకూల్చాడు చిన్నోడు.

అన్నేళ్లుగా ఎన్నో మూగజీవాలకు ప్రాణం పోసిన నెమలినార! నారాయణయ్యకు ఎంతో ఇష్టమైన నెమలి నార ఫెళఫెళమంటూ నేలకూలింది. ఇక కానుగ చెట్టుదే తరువాయి వంతు!

విలవిలలాడిపోయాడు నారాయణయ్య.

సాంప్రదాయంగా, ఈ చెట్టంత నిటారుగా నిల బడిన తన విద్య, వైద్యం కూడా నిట్ట నిలువునా కూలి పోయిన భావన ఒళ్లంతా ఆవహించగా, ఇంట్లోకి వెళ్లి తలుపేసుకున్నాడు నారాయణయ్య.

నాలుగు రోజుల్లో అర ఎకరంలో విస్తరించి వున్న నారాయణయ్య ఇంటి రూపురేఖలు పూర్తిగా మారిపో యాయి. ఎడారిదిబ్బలా మారిపోయిన తన ఇంటి పరి సరాలను చూసిన నారాయణయ్య గుండెల్లో కలుక్కు మంటోంది.

ఈ విషయాన్ని ఆ వూరి ప్రజలు పెద్దగా పట్టించు కోలేదు. గతం మీద ఏమాత్రం అవగాహన, భవిష్యత్తు మీద ఏమాత్రం ప్రణాళికా లేని ఆ వూరి యువతరం గ్రామీణ క్రికెట్ పోటీలు నిర్వహించడంలో బిజీగా వుంది.

కాని- కొందరు వయోవృద్ధులు మాత్రం బాధ పడ్డారు. రాబోయే తరం ఎంతటి సంపదను కోల్పో యిందో వారికి తెలుసు! తమ ఊరికే కాకుండా, ఈ లోకానికే పతనం దాపురించిందని జోస్యం చెప్పేశారు.

నిజానికి- ఇప్పటికీ ఎంతటి మారుమూల కుగ్రామంలోనైనా నారాయణయ్యలాంటివారు ఒక్క రైనా ఉంటారు. వారు తమ పారంపరిక జ్ఞానంతో, మృత్యుముఖంలో వున్న ఏ మనిషినైనా, పశువునైనా, ఏ ప్రాణికోటినైనా బతికించగల సమర్థులు. తమకు తెలిసిన చిన్న చిట్కాతో, చిటికెలో ఉపశమనాన్ని కలి గించగల సాంప్రదాయిక వైద్య విజ్ఞానం వారి సొంతం. వేల సంవత్సరాల నుంచి కేవలం ముఖవాచ్యంగా కొనసాగుతూ వస్తోన్న ఈ అద్భుత సాంప్రదాయిక పరం పరను, వారు ఎంతో నిష్ఠగా ఆచరించి, ఇప్పటిదాకా సజీవంగా ఉంచగలిగారు. ఏ గుర్తింపులకూ, కొలమానా లకూ అందని ఘనత వారిది!

ఆ ఘనత మెల్లమెల్లగా మాయమైపోతోంది. ఈ సంధికాలం మరెందరు నారాయణయ్యలను మాయం చేస్తుందో?

*

అర్ధరాత్రి దాటిపోయింది. చాలారోజులుగా కలతనిద్ర పోతున్న నారాయణయ్యకు తలుపు కొడు తున్న శబ్దం వినిపించి లేచి కూర్చున్నాడు.

"ఓళ్లు! ఓళ్లురా మీరు!"

"అయ్యా లేసినావే! నేనే! చిన్నోడ్ని."

చిన్నోడి గొంతు విన్న నారాయణయ్య లేచి తలుపు తీశాడు.

"ఏమయిందిరా చిన్నోడా! ఇంత రాత్రిపూట అచ్చినవు ఏమయిందిరా!"

"అయ్యా! పయ్య సుక్కెద్దు బాగా ఆగమాగం జేస్తున్నదే! ఏమయిందో ఏమో!"

"గట్లనా పోదం పద! సూద్దాం."

తండ్రీ కొడుకులు కొట్టాలకు వచ్చి టార్చిలైటులో సుక్కెద్దును చూశారు. గూటం మీద అటూ ఇటూ తిరుగుతున్నది. నారాయణయ్యను చూడగానే బాధతో ఒక రకమైన అరుపు అరిచింది. ఆ అరుపు వినగానే నారాయణయ్యకు సగం బాధ తెలిసిపోయింది. వెనుకకు చూశాడు. బాగా పలుచటి పుర్రు వేస్తున్నది. నోటి నుంచి సొల్లు గారుస్తున్నది. కళ్ల నుంచి నీళ్లు గారు తున్నయి.

"ఎన్ని రోజులాయెరా! మేత, నీళ్లూ నడుస్తు న్నయా?"

"నిన్నటిదాక మంచిగనే ఉండెనే! ఇయ్యాళ మేప తందుకు గా ఆగవతల పడీతులకు కొట్టిచ్చిన! ఏం మేసిందో ఏమో!"

"ఎత్తుగడ్డి మేసే ఆస్తలవడి, పాముకూసం మేసి నట్లున్నది! సూద్దాం ఇవతలకు నడుసకురా!"

పయ్య సుక్కెద్దును తెచ్చి వాకిట్లో కట్టేశాడు. అది నిలబడలేక కింద కూలబడింది. నిలువెత్తు దుక్కిటెద్దు అర్ధరాత్రిపూట అలా కూలేసరికి చిన్నోడు లోపల లోపల కూలిపోయాడు. ఎద్దు నేల మీద అటూ ఇటూ దొర్లు తున్నది. చిన్నోడి మనసూ అతలాకుతలం అయిపో తున్నది.

నారాయణయ్య ఇంట్లోకి వెళ్లి ఏదో పొడి తీసుకు వచ్చాడు. నీళ్లలో కలిపి వెదురు గొట్టంతో తాగించాడు. బీరకాయ పీచుతో ఎద్దు మూపుమీద తడుతూ వుండ మని చిన్నోడిని పురమాయించాడు.

అప్పుడే తెల్లవార వస్తున్నది.

"ఈ రోగంకు నెమలినార ఆకు బాగా గుణమి స్తుండె! నాలుగు పూటలు కషాయం దాపితే ఎద్దు ఎప్ప టోల లేసి నిలబడుతుండె! ఇప్పుడెట్ల! అదొక్క సెట్టు ఉంచుమంటే ఉంచకపోతివిరా చిన్నోడా!" బాధతో అన్నాడు నారాయణయ్య.

ఈ అలికిడికి లేచి వచ్చిన పెద్దోడు కూడా పరిస్థితి చూశాడు. "ఇప్పుడనుకుంటే ఏం ఫాయిదా! అయింది అయిపోయిందిగని ఇప్పుడు ఎద్దు పాణంకే ధోకా వున్నది గదా!" అన్నాడు పెద్దోడు.

"ఎట్లన్న జెయ్యే అయ్యా! మా నలుగురి ప్రాణాలు ఆ ఎడ్ల మీదనే పెట్టుకొని బతుకుతున్నం! ఇవి దున్నాల! మేం పండియ్యాల! దానికేమన్నా అయితే నా పెండ్లాం పోరగాండ్ల గతేమవుతది?" సిన్నోడి కండ్లల్ల నీళ్లు దిరిగినయి.

సాలు పొడవునా తిండి గింజల కోసం భూమి తల్లినీ, దుక్కిటెడ్లనూ నమ్ముకున్నవాడికి అవి రెండూ తన ప్రాణంతో సమానం.

చిన్నోడి బాధ జూసి పెద్దోడు అనునయించాడు.

"ఏంటికి నారాజవుతవురా! ఇప్పుడేమయిందని! రాజులగూడెం గుట్ట దడక పక్కకు జింకల ఒర్రె దగ్గర నెమలినార చెట్లు వుండె! పొయి తీసుకస్తే అయిపాయ! ఏమంటవే అయ్యా!"

"అది శెనొద్దుల కిందటి మాట! ఇప్పుడున్నదో పోయిందో! అయినా పోయిరాండ్రి! అంతకంటే వేరే తరీకల భరోసా లేదు!"

"నేనే పోయి అస్తనే అయ్యా! నేను నెమలినార దెచ్చేదాకా ఎట్లన్నా దీన్ని జూస్త ఉండు!" అన్నాడు చిన్నోడు.

"పోగానీ! గొంచెం సద్దన్నం గట్టుకొని పో. శానా దూరమున్నది. అప్పటిదాకా దీనికి గోరెచ్చటి బెల్లం నీళ్లు దాపుండ్రి," అన్నాడు నారాయణయ్య.

ఆఘమేఘాల మీద రాజులగూడెం చేరుకున్న చిన్నోడు, అక్కడి గూడెంవాసులను నెమలినార గురించి అడిగాడు. వారు తెలియదన్నారు. చిన్నోడు వెంటనే గుట్టపక్క నుంచి జింకల ఒర్రె లోయలోకి దిగి పోయాడు. ఒర్రెగట్టుకు పచ్చనిచెట్లు చాలా కనిపిస్తు న్నాయి. కాని నెమలినార చెట్లు కనిపించడంలేదు.

చిన్నోడికి నెమలినార చెట్టు బాగా తెలుసు. చిన్న ప్పట్నుండీ దాని నీడలోనే కదా చిన్నోడు ఆడుకున్నది. పెరిగి 'మనిషి'గా మారిందీ ఆ చెట్టు నీడలోనే! చిన్నప్ప ట్నుంచీ నీడనిచ్చిన చెట్టును నిర్దాక్షిణ్యంగా నరికి వేశాడు!- ఈ 'మనిషే!'

ఒర్రెకు దూరంగా రెండు పచ్చని చెట్లు జంటగా కనిపిస్తున్నాయి. అవి నెమలినార కావచ్చేమో! చిన్నోడు వేగంగా వాటివైపు పరిగెత్తాడు. అవి నెమలినార చెట్లే అయితే వెంటనే ఆకు దూసుకొని సంచీ నిండా నింపు కుని ఇంటికి దారిపట్టాలి. పయ్య సుక్కెద్దు ఎట్లున్నదో ఏమో! చిన్నోడు చెట్ల దగ్గర దగ్గరగా వచ్చాడు. నెమలి నార! నెమలినారనే!... అవును... అదే... అదేనా... అవునా!... కదా!... కాదు!... నెమలినార కానేకాదు!... చిన్నోడి ఒంట్లో రక్తమంతా ఆవిరైనట్లనిపించింది.

అవి రెండూ తెల్ల మద్దిచెట్లు. దూరం నుంచి చూస్తే నెమలినార మెరంగనే అనిపిస్తయి.

అదిగో! మరొక పచ్చని చెట్టు. ఇది కావచ్చా! ఏమో! ఇక్కడైతే నెమలినార ఉన్నదని చెప్పాడు పెద్దోడు.

పచ్చగా కనిపించిన చెట్టునల్లా చూస్తూ చూస్తూ... నడుస్తూ నడుస్తూ... చాలా దూరమే వెళ్లిపోయాడు చిన్నోడు.

ఏ పచ్చని చెట్టును చూసినా నెమలినార చెట్టే అని భ్రమపడుతున్నాడు.

ఒక చెట్టు కింద కూలబడిపోయాడు చిన్నోడు. తెచ్చిన చద్దన్నం మూట అట్టగట్టుకుపోయింది. బోరు బుంగలోని నీళ్లు మాత్రం తాగుతున్నాడు.

పయ్య సుక్కెద్దు కండ్లల్ల గనిపిస్తున్నది! దానికే మన్నా అయితే తన బతుకెట్లా! మొన్ననే మరికొంత భూమి కౌలుకు తీసుకొని అప్పుజేసి డబ్బులు చెల్లిం చాడు. ఈసారి బాగా పండిస్తానన్న ఆశతో ఉన్నాడు చిన్నోడు. కానీ చేయి విరిగినంత పనయింది. ఇప్పుడు మరో ఎద్దు కొనాలంటే మాటలా!

నెమలినార కొట్టేసిన తన చేతుల్ని నరికేసుకోవా లన్నంత కోపం వచ్చింది చిన్నోడికి.

నిరాశగా ఇంటిదారి పట్టాడు.

మసక చీకటి పడబోతుండగా అలసిసొలసి ఇంటికి చేరాడు చిన్నోడు.

చిన్నోడి శరీరపు వాసననూ, అడుగుల కదలిక లను దూరం నుంచే గుర్తుపట్టిన పయ్య సుక్కెద్దు ఉ లిక్కిపడి లేచి, కష్టం మీద నిలబడింది.

'నెమలినార దొరికిందా?' అని సుక్కెద్దు తన చూపుల్తోనే అడిగినట్లనిపించింది. దాని కళ్లల్లో నుంచి నీళ్లు ఇంకా కారుతూనే వున్నాయి. చిన్నోడి గుండెల్లో కెలికినట్లనిపించింది.

"అచ్చేసినావురా చిన్నోడా! దొరికిందారా నెమలి నార?" ఆతృతగా అడిగాడు నారాయణయ్య.

"అయ్యా! దొరకలేదే! అడివంతా దిరిగిన! యాడ దొరకలేదు!"

"అయ్యో! దొరకలేదా! సూద్దాం మరి! ఇగ దాని కిస్మతు ఎట్లయితే గట్లయితది!"

ఆ మాట విన్న చిన్నోడు అక్కడే వున్న బండి గారెకు ఆనుకుని కూలబడిపోయాడు. పయ్య సుక్కెద్దు కూడా ఆశ వదులుకుని నిరాశగా చిన్నోడి వైపు చూస్తున్నది.

చిన్నోడికి తను కూర్చున్న చోటి నుంచి నెమలి నార కొట్టేసిన స్థలం బోసిగా కనిపిస్తోంది! 'ఏ పోశమ్మ తల్లో తన తప్పు మన్నించి, తనపై దయచూపి నెమలి నారను మళ్లీ ఎప్పటిలా పుట్టిస్తే ఎంత మంచి గుంటుండె!' చిన్నోడు చివరిగా తనకు తెలిసిన దేవతలందర్నీ ప్రార్థిస్తున్నాడు.

కానీ అంతటి మహిమ జరిగే కాలమా ఇది! తన పాపిష్టి చేతులతోనే కొట్టేశాడు! కొమ్మలు కొమ్మలుగా చెలిగి పొయ్యిలో పెట్టేశాడు. అక్కడే ఇంకా మిగిలిన నాలుగు మోపుల కట్టెలు పడి వున్నాయి. మసక చీకట్లో నెమలినార ఎండిన కట్టెలమోపు విషపు సర్పాలను కట్టగట్టి పెట్టినట్లుగా కనిపిస్తోంది! ఆ మోపులను రేపు అవతల పారెయ్యాలి!

కట్టెల మోపుల చాటుకు ఏదో ఆకుపచ్చగా కనిపించింది చిన్నోడికి. మసకచీకట్లో అదేమిటో తెలవడంలేదు. కళ్లు నులుముకుని చూస్తే నెమలినార ఆకుల్లా కనిపించాయి. 'పొద్దుట్నుంచీ నెమలినారను కళ్లల్లో పెట్టుకుని వెదికినందుకేమో ఏది చూసినా నెమలినారలా కనిపిస్తున్నది,' అని తన భ్రమను తానే తిట్టుకున్నాడు.

కానీ పరీక్షగా చూస్తే అది భ్రమ కాదని అనిపించింది. పరుగున వెళ్లి దగ్గర నుంచి చూశాడు చిన్నోడు! అది నెమలినార లేతకాడ! దాని చివరన ఆకుపచ్చని ఆకుల గుత్తి!

కట్టెలమోపులను అటూఇటూ జరిపేసి చూశాడు చిన్నోడు. తను నరికివేసిన మాను పక్కల నుంచి పొడుచుకు వచ్చిన మరి రెండు లేతకాడలు- వాటి చివరన నవనవలాడుతోన్న లేత చిగురుటాకులు!

సమాధి అయిపోయిందనుకున్న సాంప్రదాయ వైద్యవిద్య నేలను చీల్చుకొని పైకి వచ్చిన వేళ అది.

"అయ్యా! అయ్యోయ్! జెల్దిరా! జెల్దిరా! నెమలి నార! నెమలినార!"

చిన్నోడి అరుపులకు నారాయణయ్యతో సహా అందరూ పరుగెత్తుకొచ్చారు.

"అయ్యా నెమలినార ఉన్నదే! అయ్యా! బతికే ఉన్నదే! ఇగో సూడు ఎట్ల ఇగురేసిందో!" చిన్నోడి సంతోషం పట్టరాకుండా ఉంది.

నారాయణయ్య సంభ్రమంగా వచ్చి చూశాడు.

"చాలురా చిన్నోడా! ఇగ నీ సుక్కెద్దు బతికిందనుకో! నెమలినార చావలేదు, బతికే ఉంది!" ఆర్తితో అన్నాడు నారాయణయ్య.

నిజమే! నెమలినార చావలేదు. ఎవరో ఒకరు నరికేసినా, ఎప్పుడో ఒకప్పుడు భూమిని చీల్చుకొని పైకి పొడుచుకొని వస్తూనే వుంది. వస్తూనే వుంటుంది. ఎవరో ఒక నారాయణయ్య తన చేదబావిలోంచి నీళ్లు పోసి దానిని పెంచి పెద్ద చేస్తూనే వుంటాడు!

*తెలుగు పలుకు (తానా సావనీర్), 2005*
*నవ్య వారపత్రిక, 20 జులై 2005*

